
# కుక్కబుద్ధి

నందం రామారావు



జగన్నాథం ప్రొద్దుటనుంచీ చిరాగ్గానే వున్నాడు జగన్నాథం చిరాకుపడుతుంటే ఆయన వెంటవున్న గుమాస్తా శంకరయ్య గడగడలాడి పోతున్నాడు! "శంకరయ్యా! ఒక్కపనీ కాలేదు" అన్నాడు జగన్నాథం స్టేషన్ ముందు జట్కా దిగుతూ

"చిత్తం... చిత్తం..." అన్నాడు శంకరయ్య వినయంగా

"ఏవిటోనోయ్ ఒక్కో రోజింతే ఈ దిక్కుమాలిన పల్లెటూరి ప్రయాణం పెట్టుకున్నప్పుడే అనుకున్నాను— ఏం పనవుతుందో వని! ఆఖరికి అట్లాగే అయింది. పొలాల బేరం కుదరలేదు దానికితోడు కారు చెడిపోయింది. ఛీ! ఛీ! ఈ వెధవ జట్కా, ఈ రైలు ప్రయాణం తప్పలేదు!"

విసుక్కుంటూ స్టేషను అనబడే ఒక రేకుల షెడ్డులోకి వచ్చారు జగన్నాథం.

ఆయన కుడి చేతిలో వెండి పిడి వేసిన బెత్తం, ఎడమ చేతిలో కుక్క గొలుసూ వున్నాయి ఆ గొలుసు చివర గోధుమరంగులో తోడేలులా భయంకరంగా వున్న కుక్కవుంది.

శంకరయ్య గబగబా ముందు వెళ్ళి ఆ షెడ్డులో వున్న ఒకే ఒక సిమెంటు బెంచీని తుండుతో తుడిచాడు

"అయ్యగారూ! తమరిక్కడ కూర్చోండి బండి ఎన్ని గంటలకో కనుక్కొస్తాను" అని వెళ్ళాడు శంకరయ్య

జగన్నాథం ఆ బెంచీమీద ఠీవిగా కూర్చున్నాడు శంకరయ్య ఐదు నిముషాల్లో తిరిగొచ్చి— "అయ్యగారూ! బండి ఇప్పుడప్పుడే రాదుటండీ" అన్నాడు.

"ఎందుకని? లేటా?"

"అక్కడెక్కడో పట్టాలు తొలిగాయటండీ అందుచేత బండి ఎప్పుడొస్తుందో తెలియదన్నాడు"

"ఎవరు చెప్పారు?" జగన్నాథం కనుబొమలు కోపంతో ముడవడ్డాయి.

"స్టేషనుమాస్టరు గది తాళం వేసుందండీ అక్కడున్న పోర్టరు చెప్పాడు"

జగన్నాథానికి కోపం, విసుగూ ఎక్కువయ్యాయి కాని, ఎవరిమీద తన కోపం చూపించాలో తెలియలేదు!

"అయ్యగారూ! పోనీ.. వూళ్ళోకి పోదామంటారా!" శంకరయ్య జగన్నాథం ముఖంలోకి భయం భయంగా చూస్తూ అడిగాడు

ఆ మాటకి జగన్నాథం మండిపడుతూ—

"మళ్ళీ వూళ్ళోకా? రెండు మైళ్ళు వెళ్ళాలి అందులోనూ ఆ వెధవ జట్కా బండిలో. ఎందుగ్గానీ, రైలు వచ్చేవరకూ ఇక్కడే తగలడదాం"

"చిత్తం" అంటూ చేతులు కట్టుకుని ప్రక్కగా నిలబడ్డాడు శంకరయ్య.

టైము ఆరు దాటింది

చలికాలం కావడం వలన తొందరగానే చీకటి పడింది. చుట్టూ అడివిలా వుంది. చెట్లు జాట్లు విరబోసుకున్న దెయ్యాల్లా

వున్నాయి. చెట్లసందుల్లోంచి గాలివీస్తుంటే విశాదేవి ఈ పాడు లోకంలోకి ఎందుకొచ్చానా అని ఏడుస్తున్నట్లుగా వుంది!

ఈ చీకట్లో ఒంటరిగా ఆ చిన్న స్టేషన్లో కూర్చోవడానికి భయం వేసింది జగన్నాధానికి!

"ఏంచేద్దాం శంకరయ్యా?" అన్నాడు మెల్లగా.

ప్రస్తుతం వున్న ఈ పరిస్థితిలో శంకరయ్య ఒక్కడే తనని ఆదుకునే వ్యక్తిలా కనిపించాడు!

అయ్యగారు అలా మెత్తగా అడిగేసరికి శంకరయ్య పొంగిపోయాడు. మరింత వినయం చూపుతూ– "మీరే చెప్పండయ్యా"అన్నాడు.

జగన్నాధం ఆలోచనలో పడ్డాడు. వ్యాపారానికి సంబంధించిన అనేక సమస్యలను అవలీలగా పరిష్కరించగలిగిన జగన్నాధానికి ఈ సమస్య విప్పలేని చిక్కుముడిలా కన్పించింది!

విడమచేతితో కండువా సరిచేసుకుంటున్న వాడల్లా ఉలిక్కిపడి–

"శంకరయ్యా! రాజా ఏడీ?" అన్నాడు కంగారుగా.

శంకరయ్య కూడా గాబరాగా చుట్టూ చూశాడు.

దశమినాటి చంద్రుడు అక్కడేముస్తాబు చేసుకుని తెరమీద కొస్తున్నాడు.

ఆ వెన్నెల్లో శంకరయ్యకి దూరంగా ఏవో రెండు ఆకారాలు కనిపించాయి!

"చూస్తూనుండండి" అని శంకరయ్య అటుగా వెళ్ళాడు.

అక్కడ రాజా మరో కుక్కకెదురుగా నిలబడి వుంది.

శంకరయ్య బలవంతంగా రాజాని లాక్కొస్తున్నాడు వెంట ఆ కుక్క కూడా పరిగెట్టుకు వస్తోంది!

"ఇదిగోనండి" శంకరయ్య ఆయాసపడుతూ జగన్నాధానికి గొలుసు అందించాడు.

రాజా వెనక్కి చూస్తూ గొలుసులాక్కుంటోంది!

అవతలికుక్క సన్నగా, ఒళ్ళంతా పొడలతో అసహ్యంగా వుంది. అది రాజా దగ్గరకొచ్చి ప్రక్కనే నిలబడింది.

జగన్నాధం ఆ దృశ్యం చూసి మండిపడ్డాడు.

"రాజా" అంటూ అరిచాడు.

# కుక్క బుద్ధి

ఆ కేకకు రాజా పిల్లిలా అయిపోయింది!

"ఛీ... ఛీ..." అంటూ అవతలికుక్కను కర్రతో విదిలించాడు.

అది దూరంగా వెళ్ళి నుంచుంది!

చలిగాలి రివ్వున కొడ్తోంది.

శంకరయ్య సూట్‌కేస్‌లోంచి శాలువాతీసి జగన్నాధానికిచ్చాడు. జగన్నాధం శాలువా కప్పుకున్నాడు. అయినా, చలికి ఆగలేకుండా వున్నాడు.

అది గమనించిన శంకరయ్య–

"అయ్యగారూ! తమకి ఇక్కడ చలిగా ఉన్నట్టుంది. ఈ స్టేషన్‌కి అవతలి ప్రక్కన టీ కొట్టు వుంది. అక్కడ కూర్చుంటారా?" అన్నాడు.

### తారుమారు!

ఒకనాడు ... అవినీతిపరులు
మనుషుల మధ్య
తులసి వనంలో గంజాయి మొక్కలు...
నేడు ... నీతి పరులు
మనలో ...
తులసి వనంలో గంజాయి మొక్కలు!

– ఎస్. వి. ఆర్. సత్యనారాయణమూర్తి

జగన్నాధానికి ఆ మాట నచ్చింది.

"ఈ చలిలో, ఈ చీకటిలో ఇక్కడ కూర్చుని చేసేదేం వుంది?" అనుకొని లేచి నిలబడ్డాడు జగన్నాధం.

* * *

'టీ స్టాలు'అనబడే పాక ఆ స్టేషన్‌కి దగ్గరోనే వుంది. పాకలో చిన్న లాంతరు వెలుగుతోంది.

ముందున్న బల్లమీద గాజుసీసాలున్నాయి. ఆ గాజు సీసాల్లో బిస్కెట్లు, బిళ్ళలు, వక్కపొడి పొట్లాలు, సిగరెట్లు, బీడీలూ వున్నాయి. ప్రక్కనే వున్న పళ్ళెంలో బన్ను ముక్కలున్నాయి.

వాటి కెదురుగా ఒక స్త్రీ చిన్న బల్లమీద కూర్చుని వుంది. జగన్నాధాన్ని చూడగానే– లేచి "రండయ్యా" అంటూ ఆహ్వానించి బల్లలు సరిచేసింది.

జగన్నాధం లోపలకొచ్చి బల్లమీద కూర్చున్నాడు. కండువా, చొక్కా సరిచేసుకున్నాడు ఆ కదలికలో వేళ్ళకున్న వుంగరాలు తళ తళ లాడాయి.

వాటిని చూడగానే ఆ స్త్రీ ముఖం కళ కళలాడింది.

ప్రొద్దుట మంచి గంజి నీళ్ళకైనా డబ్బులు రాలేదు.

'అయ్యగారు బాగా డబ్బున్నోరిలానే వున్నారు. ఒక రూపాయి డబ్బులన్నా రాకపోతాయా' అని అనుకుని–

"అయ్యగారూ! ఏం కావాలండి?" అడిగింది.

"రెండు టీ" అన్నాడు జగన్నాధం.

ఆ స్త్రీ లోపలకెళింది. రెండు నిముషాల్లో రెండు గాజుగ్లాసుల్లో 'టీ' తెచ్చియిచ్చింది.

టీ గ్లాసు తీసుకుంటూ జగన్నాధం ఆమె వేపు చూశాడు.

ఆమెకు దాదాపు ముప్ఫై ఏళ్ళుంటాయి వళ్లోగా వుంది ముఖమంతా జిడ్డుగా వుంది దానికితోడు మురికిగావున్న చీర.

"నీ పేరేమిటి?"అడిగాడు జగన్నాధం.

"రత్తమ్మండి" అంది కొదిగా సిగ్గుపడుతూ.

ఒయ్యారంగా నిలబడి,అలా సిగ్గుపడుతూ చెప్తున్న రత్తమ్మని చూస్తుంటే, ఈ చలిలో వెచ్చని కుంపటి ముందు కూర్చున్నట్టుగా అనిపించింది జగన్నాధానికి!

"ఒక్కదానివే వున్నట్టున్నావే!"అన్నాడు జగన్నాధం ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

"ఒక్కదాన్నే ఏంటి బాబూ, మా మావ కూడా వున్నాడు" అంది రత్తమ్మ.

"ఏడి?" అంటూ చుట్టూ చూశాడు జగన్నాధం.

రత్తమ్మ నవ్వింది –

"ఇప్పుడు లేడు బాబూ, పట్నం పోయాడు సరుకులు తేవడానికి. రేపొద్దున వత్తాడు" అంది.

"మరి, నీకు భయంగా లేదా?"

"నా కెందుకు భయం?" రత్తమ్మ కిలకిలా నవ్వింది.

రత్తమ్మ నవ్వు జగన్నాధం గుండెల్లో గుచ్చుకుంది!

"ఒక రొట్టెముక్క ఇటివ్వు" అన్నాడు.

రత్తమ్మ రొట్టెముక్క ఇచ్చి, గ్లాసులు తీసుకుని లోపలకెళ్ళింది.

# కుక్క బుద్ధి

జగన్నాథం ఆ రొట్టెను రాజా కందించాడు. కానీ, రాజా దాన్ని అందుకోలేదు !

ఇంతలో బయట మంచి కుక్క అరుపు వినిపించింది. రాజా ఆ అరుపు విని అటు తిరిగి తనూ అరవసాగింది !

జగన్నాథం విసుక్కున్నాడు.

'ఛీ ! కనకపు సింహాసనమున... అన్నట్లు దీనికి ఎన్ని రాజభోగాలు అమర్చినా దీనిబుద్ధి పోనిచ్చుకుంది కాదు. ఆ వెధవ కుక్కతో చేరాలని చూస్తోంది !'

"శంకరయ్యా ! దాన్ని అవతలకు తరిమెయ్" అన్నాడు కోపంగా.

శంకరయ్య లేచి ఆ కుక్కని అవతలకి తరిమొచ్చాడు.

ఈ లోపల రత్నమ్మ లోపల్నుంచొచ్చి బల్లమీద కూర్చుని—

"అయ్యగారూ ! ఏ బండికి పోవాలండీ?" అనడిగింది.

"మా బండి ఎప్పుడొస్తుందో మాకే తెలియదు" అన్నాడు జగన్నాథం.

చల్లనిగాలి రివ్వురివ్వున వీస్తోంది.

ఆ చెక్క బల్లమీద కూర్చోడం జగన్నాథానికి అసౌకర్యంగా వుంది !

రత్నమ్మ లేచి సీసాలు సర్దసాగింది.

జగన్నాథం కళ్ళన్నీ రత్నమ్మ మీదనే వున్నాయి.

అందంగా లేకపోయినా, వంటరిగా వుంది !

శంకరయ్య క్రింద కూర్చునే కునికిపాట్లు పడుతున్నాడు.

వున్నట్టుండి రాజా బిగ్గరగా అరిచింది.

రత్నమ్మతో వూహాలోకాల్లో విహరిస్తున్న జగన్నాథం వులిక్కిపడి తలెత్తి చూశాడు.

ఆ కుక్క మళ్ళీ వచ్చింది !

అది పాకలోకి రావాలని ప్రయత్నిస్తోంది.

రాజా దాని దగ్గరకు వెళ్ళాలని ముందుకురుకుతోంది.

జగన్నాథం కోపంగా కర్ర విసిరాడు.

ఆ కర్ర ఆ కుక్క కాలికి తగలడంతో అది 'కుయ్యో' మంటూ అరుస్తూ కుంటు కుంటూ వెళ్ళిపోయింది !

రాజా, ఆ కుక్క వేపు చూస్తూ దీనంగా అరుస్తోంది

"శంకరయ్య లేచివెళ్ళి చేతికర్ర తెచ్చి జగన్నాథానికిచ్చాడు.

"శంకరయ్యా! దీని గోల ఎక్కువగా వుంది" అన్నాడు కోపంగా జగన్నాథం.

శంకరయ్య అవునన్నట్టు తలూపాడు.

రత్నమ్మ లోపలకెళ్ళి తన పక్క వేసుకొచ్చింది.

జగన్నాథం, రత్నమ్మను చూస్తూ ఆవలించాడు.

"అయ్యగారికి నిద్దరొస్తున్నట్టుందే"

"ఊఁ" అన్నాడు జగన్నాథం రత్నమ్మ వేపు చూస్తూ.

శంకరయ్య అక్కడ వున్న రెండు బల్లల్ని కలిపాడు. కలిపి దానిమీద బెడ్డింగు పరిచాడు. తనేమో పాక బయట చిన్నబల్ల వేసుకుని దాని మీద పడుకుని ముసుగు పెట్టాడు.

జగన్నాథం బెడ్డింగు మీద కూర్చున్నాడు.

"అయ్యగారూ ! నేను లోపల పడుకుంటాను, ఏమన్నా కావలిస్తే పిలవండి" అని ఒక ఓరచూపు జగన్నాథం మీద విసిరి లోపల కెళ్ళింది రత్నమ్మ

రాజా పాకలో మంచమని వుంది.

జగన్నాథం రాజా మెడలో వున్న గొలుసును రెండు బల్లలకు వేసి గట్టిగా కట్టాడు, అది ఎక్కడికీ వెళ్ళకుండా వుండడానికి.

ఆ కుక్క మళ్ళీ కుంటు కుంటూ వచ్చి పాక బయట ముడుచుకుని కూర్చుంది రాజాని చూస్తూ.

రాజా ఏం చెయ్యలేక ఆ కుక్క వేపు జాలిగా చూసింది !

దాదాపు అరగంట గడిచింది.

జగన్నాథం నెమ్మదిగా లేచాడు అటూ ఇటూ చూశాడు. ఎవరూ చూడ్డంలేదని నిర్ధారించుకుని నెమ్మదిగా రత్నమ్మ పడుకున్న చోటు కెళ్ళాడు.

రత్నమ్మ దగ్గరకెళ్ళిన యజమాని కేసి తీక్షణంగా చూసింది రాజా !

మనిషి జంతువులోంచి వచ్చాడు ఈ సత్యం నిజమైనంత మాత్రాన మనిషి జంతువు కాడు ! మనిషికి జంతువుని మించిన తెలివితేటలున్నాయి, విచక్షణాజ్ఞానం వుంది. ఐతే మనిషి తన ప్రత్యేకతల్ని మరచి జంతువుగా మారినప్పుడు ...ఇదిగో ఇలాగే వుంటుంది !

'జగన్నాథం! నే నింకో 'కుక్క' తో తిరుగుతున్నానని నాది కుక్కబుద్ధి అన్నావ్ బాగానే వుంది. నే నెలాగూ కుక్కనే ! నీ కింట్లో అందమైన భార్య వుంది అంతందమైన భార్య నుంచుకుని ఇప్పుడు నువ్వు చేస్తున్న పనేమిటి ? సిగ్గు లేకుండా నీ హోదానూ, నీ వయస్సునీ మరచి రత్నమ్మతో ఈ రాత్రికి గడపాలని వుబలాట పడుతున్నావ్. ఇప్పుడు మరి నిన్నేం అనాలి ? నీకే పేరు పెడితే సరిపోతుంది ?'

భగవంతుడు రాజాకి ఆలోచనా శక్తి మాట్లాడగలగడం గనుక ఇస్తే పై మాటలు తప్పకుండా జగన్నాథాన్ని నిలదీసి మరీ అడిగేది !

అప్పుడీ సృష్టి మరో రకంగా వుండేది ! ఇంతసేపటికీ యజమాని లోపల్నుంచి రాకపోవడంతో రాజా 'భౌ భౌ' మంటూ అరవసాగింది !

